క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: చార్మినార్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో సోమవారం విద్యుత్ ఉండదని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అత్తాపూర్ ఫీడర్‌లో ఉదయం 10 గంటల నుంచి 1గంట వరకు గాంధీ విగ్రహం, రాధాకృష్ణనగర్, కాంతారెడ్డినగర్, అత్తాపూర్, హైదర్‌గూడ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, సిరిమల్లెనగర్, నలందానగర్, వెంకటేశ్వర కాలనీ, లోటస్ స్కూల్, న్యూఫ్రెండ్స్ కాలనీ, లక్ష్మినగర్, కాంతారెడ్డినగర్, ఏజీ కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 4 గంటల నుంచి 5 గంటల వరకు నలందానగర్, సంజీవనీ హిల్స్ తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

అభివృద్ధిపై .. ఇంటింటికీ బీజేపీ



వెంకటేశ్వర కాలనీలో ఇంటింటి ప్రచారంలో బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకువెళ్తున్నామని పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎస్సీ మోర్చా కన్వీనర్ జోగి రవి తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ వెంకటేశ్వర కాలనీలో ఆదివారం మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికీబీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నరేంద్రమోడీ తొమ్మిదేళ్లలో దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పి.రామారావు, ఆదిముల చంద్రశేఖర్, రంగారెడ్డి జిల్లా బీసీ మోర్చా కార్యదర్శి నెలుట్ల జగన్, బీజేపీ సీనియర్ నాయకులు మాజీ వార్డు సభ్యులు కె.శ్రీకాంత్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, శేఖర్, యాదగిరి, రాజేష్, కృష్ణ, పోట్టగళ్ల రాజు, షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో మొక్కల పంపిణీ



తిరుమలహిల్స్‌లో మొక్కల పంపిణీ

మణికొండ: ప్రతి ఒక్కరు తమ ఇంటిలో వీలైనన్ని మొక్కలను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని మణికొండ మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్ అన్నారు. ఆదివారం 6వ వార్డులోని తిరుమలహిల్స్ కాలనీలో ఆయన కాలనీవాసులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మొక్కలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపాలిటీ తరపున ప్రతి వార్డులో మొక్కలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తిరుమల హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాంతారావు, సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక వివాహాలు

రాజేంద్రనగర్: మైనార్టీ డెవలప్‌మెట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక వివాహాలు ఘనంగా జరిగాయి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హసన్‌నగర్ నూరానీ మసీద్ ఆవరణలో 14 నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలకు వాహాలు జరిపించారు. అలాగే సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రీపురం కార్పొరేటర్ మిర్జా ముబీన్ బేగ్, మాజీ కార్పొరేటర్ హబీబ్ జైన్ ఆరీఫ్, హఫీజ్ సయ్యద్ తౌఫీక్, షా రఫీక్, మాజీ కార్పొరేటర్ మిస్బావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఆహ్వానం

చార్మినార్: పాతబస్తీలో ఈనెల 16న నిర్వహించే ఆషాఢమాసం బోనాల ఉత్సవాలకు రావాలని కోరుతూ భాగ్యనగర్ మహంకాళి జాతర ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్ ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆలయాలకు రూ.15 కోట్లు కేటాయించిందని, ఆ చెక్కులను ఈ నెల 10, 11వ తేదీలలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గాజుల అంజయ్య, రాకేష్ తివారీ, పాటిల్ సదానంద్‌యాదవ్, మధుసూదన్‌యాదవ్, రాజారత్నం, వీరేంద్రయాదవ్, హంస్ రాజ్, గాజుల రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

లాల్‌దర్వాజా బోనాల సీడీ ఆవిష్కరణ

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని కీర్తిస్తూ రూపొందించిన లాల్‌దర్వాజా బోనాల జాతర-2023 సీడీని ఆలయ వేదికపై ఆదివారం అర్చకులు కార్తికేయ శర్మ, చైర్మన్ రాజేందర్ యాదవ్, ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ భోజ్యా నాయక్ ఆవిష్కరించారు.

ఘనంగా బోనాల జాతర



ఇంద్రారెడ్డి కాలనీలో జరిగిన ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



బాబుల్‌రెడ్డినగర్‌లో ఘటం ఊరేగింపు



శంషాబాద్‌లో ..



అమ్మవారికి బోనం సమర్పించేందుకు వెళ్తున్న చిన్నారి

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో ఆదివారం అమ్మవారి ఆలయాల్లో బోనాలను సమర్పించారు. పట్టణంలోని కాపుగడ్డ, ఇంద్రారెడ్డికాలనీ, పోచమ్మగడ్డ, మధురానగర్, ఆర్బీనగర్, ఎయిర్‌పోర్టు కాలనీ, సిద్దంతి అమ్మవారి ఆలయాల్లో బోనాల జాతర జరిగింది. మహిళలు పెద్ద ఎత్తున బోనాలను సమర్పించారు. పోచమ్మ దేవాలయం నుంచి ఫలహారం బండి ఊరేగింపు చేపట్టారు. ఇంద్రారెడ్డి కాలనీలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రేణుకా ఎల్లమ్మ బోనాల ఉత్సవాల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు.

వైభవంగా ఘటాల ఊరేగింపు

రాజేంద్రనగర్: డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల నడుమ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్‌లో ఘటాల ఊరేగింపు వైభవంగా సాగింది. ప్రతి సంవత్సరం బోనాల పండుగకు వారం రోజుల ముందు బాబుల్‌రెడ్డినగర్‌లోని పోచమ్మ ఆలయంలో ఘటాల ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగింపును కన్నుల పండుగగా నిర్వహించారు. ఘటాలను వీధుల్లో ఊరేగించారు. ఈ ఊరేగింపులో ఎస్.వెంకటేష్, సోమ శ్రీనివాస్‌గుప్తా, అశోక్‌కుమార్, రవి, శ్రీను, అప్ప శివ, కిషోర్, శంకర్, మల్లేష్, కుమారస్వామి, జగదీష్ అగర్వాల్, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ..

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని శంషాబాద్, మధురానగర్, కవ్వగూడలలో దుర్గామాత, కట్టపోచమ్మ, కట్ట మైసమ్మ, నల్ల మైసమ్మ, లక్ష్మిగూడ, బృందావన్ కాలనీల్లోని అమ్మవారి దేవాలయాల్లో నిర్వహించిన ఉత్సవాలకు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో బలరామకృష్ణ భక్త భజన మండలి, డివిజన్ రావుల భాస్కర్, కె.అనిల్‌కుమార్‌ముదిరాజ్, అక్కెం కృష్ణయాదవ్, గణేష్‌ముదిరాజ్, డివిజన్ బీజేపీ అధ్యక్షులు అడికే జనార్ధన్, రవి, శ్యామ్‌యాదవ్, వెంకటేష్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరె మైసమ్మకు బోనం సమర్పించిన మేయర్ మహేందర్‌గౌడ్,

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆరెమైసమ్మ తల్లికి కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ బోనాన్ని సమర్పించారు. ఈ పూజల్లో జెడ్పీచైర్మన్ అనితారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, శంషాబాద్ చైర్మన్ సుష్మ మహేందర్‌రెడ్డి, కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, అస్లాంబిన్ అబ్దుల్లా, పార్టీ అధ్యక్షులు సురేష్‌గౌడ్, మాజీ ఎంపీపీ తలారీ మల్లేష్, రామకృష్ణారెడ్డి, పాపయ్యయాదవ్, గోపాల్‌ముదిరాజ్, రఘురాజ్‌గౌడ్, శ్రీరాములు పాల్గొన్నారు.



బోనంతో వస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ



లక్ష్మీగూడలో బోనాల ఊరేగింపులో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



ఆరెమైసమ్మ తల్లికి బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు



శంషాబాద్ కాపుగడ్డలో..

అన్ని విధాలా సాయమందిస్తాం

మణికొండ రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి



మృతుని భార్య మంజులకు చెక్కు అందజేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

మణికొండ: పేద రెడ్లను అన్ని విధాలుగా ఆదుకుంటామని మణికొండ మున్సిపాలిటీ రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శి కందాడ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా వేముల గ్రామానికి చెందిన పుల్లా రవీందర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో మణికొండ రెడ్డి సంఘం సభ్యులు రూ.1.50 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆయన భార్య మంజులకు మణికొండ పంచవటి కాలనీలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డి పిల్లల విద్య, వైద్యం, వివాహాలకు సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పదివేల మంది రెడ్లు సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని, ఒకరికొకరు సహకరించుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో కోశాధికారి శ్రీపతిరెడ్డి, సభ్యులు శరత్‌రెడ్డి, భీంరెడ్డి, లోహిత్‌కుమార్‌రెడ్డి, డి.శ్రీనివాస్‌రెడ్డి, వి.బాల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, బాల వెంకట్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ జట్టుకు చేయూత



కొత్త ట్రాక్ సూట్‌లో బాక్సర్‌లు, కోచ్‌లు

మణికొండ: ఐదవ జూనియర్ జాతీయ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు.. మణికొండ నవజ్యోతి యువజన సంఘం అధ్యక్షుడు, మణికొండ మున్సిపాలిటీ బీజేవైం అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి తన వంతు చేయూతను అందించారు. ఈనెల 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయ బాక్సింగ్ చాంపియన్ పోటీలకు మణికొండ, షేక్‌పేట్‌లకు చెందిన 13 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. వారికి సరైన ట్రాక్‌సూట్‌లు లేవనే విషయాన్ని తెలుసుకుని ఆదివారం వాటిని ఆయన అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టీం కోచ్‌లు వినేష్‌బాబు, శివకుమార్, రఘువీర్ పాల్గొన్నారు.

కురుమ సంఘం అధ్యక్షునిగా రమేష్‌కుమార్



కురుమ సంఘం నూతన కమిటీ సభ్యులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కురుమ సంఘం అధ్యక్షునిగా టి.రమేష్‌కుమార్ నియమితులయ్యారు. ఆదివారం బండ్లగూడలోని విజ్ఞాన్ కళాశాలలో జరిగిన సమావేశంలో రమేష్‌కుమార్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా కె.లక్ష్మణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విఠలయ్య, ఉపాధ్యక్షులుగా మల్లేష్, పి.మనోహర్, పి.రమేష్, కె.వెంకట్, ఎస్.శంకరయ్య, కె.సత్యనారాయణ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు టి.రమేష్‌కుమార్ మాట్లాడుతూ కురుమ సంఘం అభివృద్ధికి తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కమిటి రెండు సంవత్సరాల పాటు కొనసాగితుందన్నారు. ఈ సమావేశంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కురుమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బుద్వేల్ టీచర్స్ కాలనీలో ఎమ్మెల్సీ పర్యటన



టీచర్స్ కాలనీలో పర్యటిస్తున్న మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ మీర్జా రహమత్‌బేగ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్ టీచర్స్ కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ మీర్జా రహమత్‌బేగ్ అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు రియాజ్ స్థానిక సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి పర్యటించారు. రోడ్లు, డ్రైనేజీ, మంచి నీటి సమస్యలపై ఎమ్మెల్సీకి ఫిర్యాదు చేయడంతో పాటు వినతిపత్రాలు అందజేశారు. దీంతో ఆయన జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగంతో పాటు జలమండలి అధికారులకు ఫోన్ చేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీల్లో రోడ్లు శిథిలావస్థకు చేరాయన్నారు. డ్రైనేజీ, మంచినీటి సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మజ్లిస్ పార్టీ ముందుంటుందన్నారు. ఈ పర్యటనలో స్థానిక సంక్షేమ సంఘం సభ్యులతో పాటు మజ్లిస్ పార్టీ నాయకులు షేక్ అహ్మద్, ఫజల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

11,14న బోనాలు ఒడిబియ్యం సమర్పణ

జియాగూడ: బోనాల వేడుకల సందర్భంగా ఈనెల 11, 14వ తేదీలల్లో బీఆర్‌ఎస్ పార్టీ ద్వారా జియాగూడలోని మాతేశ్వరీ ఆలయాల్లో సామూహిక బోనాలు, ఒడిబియ్యం పోతరాజుల నృత్యాలతో బాజా భజంత్రీలతో ఊరేగింపుగా వెళ్లి సమర్పించడం జరుగుతుందని జియాగూడ మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ అన్నారు. ఆదివారం జియాగూడలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో అధ్యక్షుడు నరహరిచారి ఆధ్వర్యంలో సమావేశంలో మిత్రకృష్ణ మాట్లాడుతూ.. 11న జియాగూడలోని బంగారు మైసమ్మ, జియాగూడ మహంకాళీ, సంజయ్ నగర్ నల్ల పోచమ్మ, ఇందిరానగర్ నల్లపోచమ్మ, దుర్గానగర్ తుల్జా భవానీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం సమర్పణ ఉంటుందన్నారు. 14న కార్వాన్ దర్బార్ మైసమ్మ, మహంకాళి మైసమ్మ, బంజావాడి తుల్జాభవానీ మందిరాల్లో బోనాలు, ఒడిబియ్యం ఊరేగింపుగా వెళ్లి సమర్పిస్తామన్నారు. శ్రీనివాస్‌గుప్తా, బాబు, మోహన్, నర్మద, సంగీత, అనితా, దిలీప్‌కుమార్, శంకర్ రావు, సురేఖ, శాంత పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

అబిడ్స్: వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. బోన్ మినరల్ డెన్సిటీపై డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ సంగీత అవగాహన కల్పించారు. ఆదివారం మెల్కోటి పార్కు వద్ద వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఈ ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వాకింగ్, యోగా చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల లక్ష్మీనారాయణ, నాగభూషణ్‌రావు, వరకుమార్‌గుప్తా, హరికుమార్, వినోద్‌కుమార్, రాజేష్ కోలావర్, వస సత్యనారాయణ, అడుగుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు జేసీఐ హైదరాబాద్ దక్కన్ కృషి

అబిడ్స్: సమాజ సేవకు జేసీఐ హైదరాబాద్ దక్కన్ విశేష కృషి చేస్తుందని జేసీఐ ఇండియా నేషనల్ ప్రెసిడెంట్ జేఎఫ్ఎస్ కార్తికేయన్ పేర్కొన్నారు. సీతారామ్ బాగ్‌లో ఆదివారం జేసీ హైదరాబాద్ దక్కన్ సామాజిక సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్స్‌తో పాటు స్కూల్ కిట్స్ పంపిణీ చేశారు. అదేవిధంగా జగన్నాథ్‌మఠంలో ఫీడింగ్ బేబీస్ రూమ్, సోలార్ వాటర్ హీటర్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కార్తికేయన్ మాట్లాడుతూ.. సమాజ సేవ చేయడమే తమ స్వచ్ఛంద సంస్థల ఆశయమన్నారు. జేసీఐ హైదరాబాద్ దక్కన్ అధ్యక్షుడు జేఎఫ్ఎం రీతేష్ తాడ్ మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ నలుమూలలా నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విధి గుప్తా, రమేష్ దడిగాల అభినయ్ బర్మేష, మహేష్ రాఠి, బిజేష్ బంగ్, సందీప్ దారక్, రితేష్ జష్నాని, విభా బర్మేష, సిదాంత్ జైన్, ప్రణీత బొగ్గారపు, సుఖేష్ జవహార్, రాహుల్ మంత్రి, ముఖేష్, కేడియా పాల్గొన్నారు.

అమ్మవారికి తొలిబోనం

చాంద్రాయణగుట్ట: ఆషాఢమాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా జంగమ్మెట్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలో ఆదివారం తొలి బోనం సమర్పించారు. ఆలయ నిర్వాహకులు, టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సదా మణిశంకర్, సాయిఉదయ్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్ ప్రధాన రహదారిపై ఉన్న భద్రకాళి వీరభద్రస్వామి ఆలయం బలిపీఠం పూజా కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బలిపీఠం పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రోడ్ల పక్కన చెత్త కనిపిస్తే చర్యలు

నార్సింగి మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి



మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ సురేందర్‌రెడ్డి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో తడి,పొడి చెత్తను పకడ్బందీగా సేకరించి శుభ్రతను పాటించాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ బి.సురేందర్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం ఉదయం ఆయన మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులు, తడి, పొడి చెత్త సేకరణను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన శానిటేషన్ పనులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ రోడ్ల పక్కన చెత్త కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇంచార్జి లచ్చిరాం, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమా..?

నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులను సమానంగా చూస్తున్నా కొందరు విమర్శలు చేస్తున్నారని, ధైర్యముంటే వార్డు అభివృద్ధిపై చర్చకు రావాలని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి అన్నారు. వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ప్రదీప్‌కుమార్ చైర్‌పర్సన్ వార్డులో కనీస సౌకర్యాలు లేక కార్మికులు సంచిలో చెత్త ఎత్తుతున్నారని విమర్శించిన విషయం ఆదివారం పత్రికల్లో రావటంతో ఆమె స్పందించారు. తన వార్డు ప్రజలతో కలిసి అంబేద్కర్ విగ్రహం వద్ద కూర్చుని బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన వార్డు పరిధిలో మంచినీటి పైప్‌లైన్లు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు సౌకర్యాలన్నీ కల్పించామన్నారు. అయినా విమర్శలు చేయటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.సాయి, రాజులతో పాటు ప్రజలు పాల్గొన్నారు.

ఆటోసర్వీసింగ్‌కు వెళ్లింది..

ప్రతి వార్డులో మున్సిపల్ కార్మికుల వెంట చెత్త ఆటో తప్పనిసరిగా ఉంటుంది. ఆటోను సర్వీసింగ్‌కు పంపితే కార్మికులు సంచిలో చెత్త ఎత్తారు. దీన్ని ఫొటోలు తీసి రాజకీయం చేయటం తగదని నార్సింగి మున్సిపాలిటీ శానిటేషన్ ఇంచార్జి లచ్చిరాం అన్నారు.



వట్టినాగులపల్లిలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖయాదగిరి

భవిష్యత్ సమస్యలపై అప్రమత్తం కావాలి

మణికొండ: హైదరాబాద్ నగర శివారు మున్సిపాలిటీలు శరవేగంగా విస్తరిస్తున్నాయని, వాటికి అనుగుణంగానే ప్రస్తుతం, భవిష్యత్తులో వచ్చే సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులను ఎప్పటికపుడు అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందని మణికొండ, బండ్లగూడ, తెల్లాపూర్ మున్సిపాలిటీల ఆల్ కాలనీస్ ఫెడరేషన్‌ల నాయకులు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మణికొండలో మూడు ఫెడరేషన్‌లతో పాటు గండిపేట కాలనీ సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత జనాభాకే ఏమాత్రం సరిపోని రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను పెంపొందించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అసంపూర్తిగా ఉన్న లింకురోడ్లు, రేడియల్ రోడ్లను పూర్తి చేసేలా వారిపై వత్తిడి తేవాలన్నారు. ఇంటి పన్ను మదింపును జీహెచ్‌ఎంసీ తరహాలో రెంటల్ ఆదాయంపై వేయాలని, క్యాపిటల్‌పై వేయటం వలన అధిక మొత్తంలో పన్నులు చెల్లించాల్సి వస్తుందన్నారు. 1500నుంచి 2000 అడుగుల లోతుకు బోర్లు వేస్తున్నారని ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయటం, నాలాలు, చెరువులను పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో మణికొండ సమాఖ్య అధ్యక్షుడు డి. సీతారాం, ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులు, కోశాధికారి బాబురావు, తెల్లాపూర్ సమాఖ్య అధ్యక్షుడు రమణ, బండ్లగూడ సమాఖ్య అధ్యక్షుడు సుధాకర్‌లతో పాటు అనేక కాలనీ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.